క్లుప్తంగా

ఘనంగా పూర్వాభాద్ర హోమం


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో గురువారం స్వామివారి జన్మనక్షత్రమైన పూర్వాభాద్రను పురస్కరించుకొని హోమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ యాగశాలలో స్వామివారి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హోమాన్ని నిర్వహించి భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

రికార్డులు తప్పనిసరి

బుక్కరాయసముద్రం: వాహనదారుడు వాహనాలు నడిపేటప్పుడు రికార్డులు తప్పనిసరిగా దగ్గర ఉంచుకోవాలని సీఐ నాగార్జునరెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని అనంతపురం– తాడిపత్రి రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నాగార్జున రెడ్డి మాట్లాడుతూ ద్విచక్ర వాహన దారుడు హెల్మెట్ ధరించాలన్నారు. ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో ఇబ్బందుల్లేకుండా చూడండి


ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. రెండు రోజుల క్రితం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసిన కారణంగా రిజర్వాయర్ల వద్దనున్న ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. గురువారం ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు పనులను కమిషనర్ పరిశీలించారు. హంద్రీనీవా నుంచి సమ్మర్‌స్టోరేజీ ట్యాంకుల్లోకి నీటి పంపింగ్, పురప్రజలకు నీటి సరఫరాలో ఎలాంటి అవాంతరాలు చోటుచేసుకోకుండా మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

పుట్లూరు: మండల కేంద్రంలో దోమల నివారణ కోసం గురువారం పారిశుధ్య పనులతో పాటు ఫాగింగ్ చేసినట్లు సర్పంచ్ ఓబులేసు తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో కార్యక్రమం చేపట్టామన్నారు.

గుత్తికోట అద్భుతం


గుత్తి కోటను సందర్శించిన పులివెందుల వాసులు

గుత్తి: చారిత్రాత్మకమైన గుత్తి కోట అద్భుతంగా ఉందని పులివెందుల వాసులు కొనియాడారు. గురువారం పులివెందుల టౌన్ చర్చి స్త్రీల మైత్రి సంఘం ప్రెసిడెంట్ కళ్యాణమ్మ, వైఎస్ మాధవి, పులివెందుల డివిజన్ చర్చిల చైర్మన్ ఆనంద రావు(బాబు)తో పాటు పలువురు సభ్యులు గుత్తి కోటకు వచ్చారు. బ్రిటిష్ సమాధులు, దర్గా, గుర్రపు శాలలు, ఏనుగు శాలలు, సైనికుల కవాతు ప్రాంతాలను వీక్షించారు. వీరికి గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులు వారికి స్వాగతం పలకగా, గైడ్ గుత్తి కోట చరిత్రను వివరించారు.

బాధితుడికి జెడ్పీటీసీ ఆర్థికసాయం


ఈశ్వర్ తల్లికి ఆర్థిక సాయాన్ని అందిస్తున్న జెడ్పీటీసీ రమణమ్మ

తాడిపత్రి అర్బన్: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్న గన్నెవారిపల్లి కాలనీకిచెందిన ఈశ్వర్‌ను జెడ్పీటీసీ సభ్యురాలు కురుబ రమణమ్మ గురువారం పరామర్శించారు. ఈశ్వర్ ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అతడికి రూ.10 వేల నగదు అందజేశారు. కౌన్సిలర్ మారపురెడ్డి రంగనాథ్‌రెడ్డి, చింతకుంట సర్పంచ్ కురువ శివరామయ్య, ఉమ్మడి గురుప్రసాద్‌రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డీలర్ల సమావేశం

శింగనమల: తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని ప్రభుత్వ చౌక ధాన్యపు డిపో డీలర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఈశ్వరమ్మ గురువారం తెలిపారు. డీలర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు హాజరుకావాలన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ



గుంతకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం మతపెద్దలు, తాడిపత్రి అర్బన్: ర్యాలీ పాల్గొని సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

గుంతకల్లు: పట్టణంలోని ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. సాయంత్రం పోర్టర్ లైన్‌లోని గులాంషా ఖాద్రీ బాబా దర్గాలో ప్రభుత్వ ఖాజీ సయ్యద్ రజాక్‌పీర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం జమాతే ఇస్లాహే మిల్లత్ కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ ప్రారంభించారు. పోర్టర్‌లైన్ దర్గా నుంచి ప్రారంభమైన ర్యాలీ ధర్మవరం గేట్, ప్రధాన రహదారి మీదుగా మస్తానయ్య దర్గా వరకు కొనసాగింది. వందలాది మంది యువకులు బైక్ ర్యాలీగా ముందుకు సాగారు. మక్కా మసీదు నమూనాలు, మహ్మద్ ప్రవక్తకు సంబంధించిన జెండాలను ప్రదర్శించారు. ఇదిలా ఉండగా మున్సిపల్ కార్యాలయం వద్ద ర్యాలీ పాల్గొన్న ముస్లింలకు చైర్‌పర్సన్ భవాని, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డి జ్యూస్, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్లు ఎస్.రామలింగప్ప, జింకల రామాంజనేయులు, వీరశైవలింగాయత్ డైరెక్టర్ పాటిల్ యుగంధర్‌రెడ్డి, కౌన్సిలర్లు మెహరున్నీసాబేగం, కేవీ నాగరత్న తదితరులు పాల్గొన్నారు. డీఎస్పీ నరసింగప్ప, సీఐలు రామసుబ్బయ్య, గణేష్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

తాడిపత్రి అర్బన్: మిలాద్ ఉన్ నబీ వేడుకలను గురువారం పట్టణంలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజును పురస్కరించుకుని సిద్దిబాషా దర్గా, యాసిన్‌పుర దర్గాను శోభాయమానంగా అలంకరించారు. బుధవారం రాత్రి నుంచే ముస్లింలు సోదరులు మసీదుల్లో జాగారణ చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గురువారం ఉదయం ముస్లింలు భారీ జులుస్ నిర్వహించారు. మెయిన్‌బజారులోని ఆంధ్రా బ్యాంకు నుంచి ఉదయం 9 గంటలకు ప్రారంభమైన జులుస్ అశోక్‌పిల్లర్ మీదుగా, సీబీరోడ్డు, మెయిన్‌బజార్ మీదుగా తిరిగి ఆంధ్రాబ్యాంకు సమీపంలోని యాసిన్‌పురా దర్గా వద్దకు మధ్యాహ్నం 12 గంటలకు చేరుకుంది. ఈసందర్భంగా ముస్లింలు మతపరమైన జెండాలను ప్రదర్శించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి జులుస్‌లో పాల్గొని ముస్లింలను ఆలింగనం చేసుకుని మిలాదున్నబీ శుభాకాంక్షలు తెలిపారు. అశోక్‌పిల్లర్ సమీపంలోని సిద్దిబాషా దర్గాలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి చాదర్ సమర్పించి ముస్లిం మతపెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే మైనార్టీ నాయకుడు హీరాపురం ఫయాజ్‌బాషా, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దూదేకుల బాబయ్య జులుస్‌లో పాల్గొని ఈద్ ముబారక్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్ రెడ్డి రమేష్‌రెడ్డి కాలనీలో ముస్లింలకు ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. జులుస్‌లో పాల్గొన్న ముస్లింలకు స్థానిక బండా మసీదు, యాసిన్‌పురా దర్గా వద్ద అన్నదానం నిర్వహించారు.

యల్లనూరు: మండల కేంద్రంలో బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకు మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జెండాలతో పురవీధుల్లో ఊరేగించారు. ముస్లింలకు భోజన వసతి ఏర్పాటు చేశారు. ముస్లిం మత గురువు రషీద్ నూరీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. మైనార్టీ నాయకుడు చాంద్‌బాషా, హైదర్, నజీర్, ఖాదర్, అన్సర్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

యాడికి: మండల కేంద్రంతో పాటు రాయలచెరువులో గురువారం మిలాద్ ఉన్ నబీ పండగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా మండల కేంద్రంలోని జామియా మసీదు, రాయలచెరువులోని నగరూరు రహదారిలో ఉన్న మసీదు వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మక్కా మదీనా నమూనాను అందంగా అలంకరించి ప్రత్యేక వాహనంలో ఉంచిన గంధంతో మత గురువులు ఉమర్ అలీ ఆధ్వర్యంలో ముస్లింలు గ్రామ పురవీధుల గుండా ప్రత్యేక గీతాలాపనలు నిర్వహిస్తూ ర్యాలీగా దర్గా వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం మసీదుల వద్ద ఆయా మసీదుల కమిటీ సభ్యులు ముస్లింలకు అన్నదానం ఏర్పాటు చేశారు. జామియా మసీదు ముతువల్లి మహమ్మద్ రఫీ, కమిటీ సభ్యులు సులేమాన్, ఖాదర్ వలి, హాజీ మస్తాన్, అసిఫ్, రాయలచెరువులో జిలాన్, రషీద్ తదితలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మసీదుల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లలో ముస్లింలు గురువారం మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లలో మక్కా మసీదు నమూనాలను ఊరేగించారు. గుత్తిలోని మన్రో సత్రం వద్ద ఉన్న హజరత్ దర్గా వద్ద నుంచి గాంధీ సర్కిల్, రాయల్ సర్కిల్ వరకు అటు నుంచి తిరిగి కోటలోని అసర్ మసీద్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అసర్ మసీద్‌లో మహమ్మద్ ప్రవక్త కేశాలను ప్రదర్శించారు.

జామియా మసీదులో అన్నదానం..

గుత్తి ఆర్ఎస్‌లోని జామియా మసీదులో మిలాన్ ఉన్ నబీ సందర్భంగా ముస్లింలు భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ పీరా హాజరయ్యారు.

పామిడి: మండలకేంద్రంలో గురువారం ముస్లింలు మిలాద్ ఉన్ నబీ పండుగను ఘనంగా నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆకుపచ్చ జెండాలతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ముతవల్లి బీ రుక్మాన్, బెంకి ముస్తఫా, షెక్షావలి, బారాన్ సాబ్, ఫర్యాద్ తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా గురువారం ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మర్తాడులో జామీయ మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామంలో జెండాలతో ర్యాలీ నిర్వహించారు.


మున్సిపల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ముస్లింలకు మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న దృశ్యం


తాడిపత్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు


గుత్తి : జామియా మసీదులో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం


గుత్తి: ఊరేగింపులో పాల్గొన్న ముస్లింలు


యల్లనూరు: జెండాలతో ఊరేగింపులో చిన్నారులు, ముస్లింలు


పామిడిలో ర్యాలీ చేస్తున్న ముస్లింలు


యాడికిలో దర్గాకు తరలుతున్న దృశ్యం

పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్


సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

తాడిపత్రి అర్బన్: కుల,మత,వర్గ, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. గురువారం భగత్‌సింగ్‌నగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా ప్రతి గడపకు చేరుతున్న సంక్షేమ పథకాలతో పేదవారు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. జగనన్న సంక్షేమ పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, ఆ పథకాలే వచ్చే ఎన్నికల్లో తమను గెలిపిస్తాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత సూర్యప్రబాకర్‌బాబు, విద్యార్థి విభాగం పట్టణాధ్యక్షుడు మనోజ్, రామకృష్ణ, బాబా, పేరం ఆది తదితరులు పాల్గొన్నారు.

కుంగిపోయిన సీసీరోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే..

స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదుట కుంగిపోయిన సీసీరోడ్డును గురువారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పరిశీలించారు. భారీ వాహనాలు ఈ దారి గుండా వెళ్లడంతో సీసీరోడ్డు కుంగిపోయి గొయ్యి ఏర్పడింది. దీంతో ద్విచక్రవాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడకుండా మున్సిపల్ అధికారులు కంచె ఏర్పాటు చేశారు. ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు రామేశ్వర్‌రెడ్డి, పేరం ఆది ఉన్నారు.

కచ్చితమైన తూకంతో రేషన్ పంపిణీ చేయాలి


తూకం రాళ్లను పరిశీలిస్తున్న తూనికల కొలతల అధికారి శంకర్

యాడికి: కచ్చితమైన తూకంతో రేషన్ పంపిణీ చేయాలని తూనికలు కొలతల అధికారి శంకర్ ఎండీయూ ఆపరేటర్లకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో మండలంలోని 35 చౌకధాన్యపు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో ఆయన సమావేశమయ్యారు. ముందుగా ఆయా డీలర్లు ఉపయోగిస్తున్న తూకం రాళ్లు ఖచ్చితంగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. కొంతమంది ఎండీయూ ఆపరేటర్లు డబ్బాతో తూకం వేస్తున్నారని, మరి కొందరూ రేషన్ షాపు వద్దనే డబ్బాతో తూకం వేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయన్నారు. వచ్చే నెల నుంచి రోజూ అన్ని రేషన్ షాపులతో పాటు ఎండీయూ వాహనాలను తనిఖీ చేస్తామన్నారు. కొలతల్లో తేడా వస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తూనికల సిబ్బంది, రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి


గుర్రం జాషువా చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

గుంతకల్లు: స్థానిక ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం భారతీ సాహితి సమితి ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గుర్రం జాషువా కులమత బేధలు, అంటరానితనంపై అనేక రచనలు చేసి మన్నలు పొందారని వక్తలు గుర్తు చేశారు. సమితి అధ్యక్షుడు ఈఓ రాముడు, ప్రధాన కార్యదర్శి ఆర్.గంగమ్మ, రిటైర్డు తహసీల్దార్ చలపతి, గంగరాజు, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి అర్బన్: కుటుంబ కలహాలతో చుక్కలూరు ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. రూరల్ అప్‌గ్రేడ్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన గంపయ్య(50)కు ఇద్దరు భార్యలున్నారు. తరచూ గొడవలు జరిగేవి. ఈక్రమంలో గురువారం ఎస్సీ కాలనీలోని తన ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అనారోగ్యంతో మరో వ్యక్తి..

గంగాదేవిపల్లిలో అనారోగ్యంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ అప్‌గ్రేడ్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రామ్మోహన్‌రెడ్డి(45) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. ఈక్రమంలో గురువారం గ్రామంలోని నల్లవంక తోటలోని సపోటా చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య సుధామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నేడు 'గడప గడపకూ'

తాడిపత్రి అర్బన్: భగత్‌సింగ్ నగర్‌లో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుంది. భగత్‌సింగ్‌నగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి కార్యక్రమం ప్రారంభం కానుంది. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

మెగా రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ప్రభుత్వ ఖాజీ రజాక్‌పీర్ సాహెబ్

గుంతకల్లుటౌన్: మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా రెడ్‌డ్రాప్ బ్లడ్‌డోనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాలను పట్టణ ప్రభుత్వ ఖాజీ సయ్యద్ రజాక్‌పీర్ సాహెబ్ ప్రారంభించారు. మస్తాన్‌వలి దర్గా, ఆర్అండ్‌బీ సర్కిల్, ప్రభుత్వాస్పత్రి ఆవరణల్లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాల్లో 143 మంది రక్తదానం చేసి మానవత్వం చాటారు. ఈ సందర్భంగా రక్తదాతలకు ప్రశంసాపత్రాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వంశీకృష్ణ, సమాజ సేవకుడు ఇస్మాయిల్, రెడ్‌డ్రాప్ వ్యవస్థాపకులు రెహమాన్, అధ్యక్షుడు గులాం మహమ్మద్, కార్యదర్శి షఫీ. కోశాధికారి మనోహర్, సభ్యులు సురేష్, హనుమంతు, తిప్పన్న, రాము, ల్యాబ్ టెక్నీషియన్లు సత్య, ఉమ, రాజు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేద్దాం


భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

గుంతకల్లుటౌన్: స్వాతంత్య్ర సమరయోధుడు భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేద్దామని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ప్రతాప్, చరణ్ పేర్కొన్నారు. భగత్‌సింగ్ 116వ జయంతి వేడుకలను డీవైఎఫ్ఐ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు సునీల్, శ్రీనాథ్, యశ్వంత్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలో గురువారం జేవీవీ, ఎస్ఎఫ్ఐ, భగత్‌సింగ్ బోస్ కమిటీ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు డాక్టర్ రంగన్న, వెంకటరామిరెడ్డి, బోస్ కమిటీ సభ్యులు నిజాముద్దీన్, ఎస్ఎఫ్ఐ నేత రమేష్, గైడ్ రమేష్, దీపిక తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

యాడికి: మండల కేంద్రానికి చెందిన యువతి అదృశ్యమైంది. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి వివరాల మేరకు..మండల కేంద్రానికి చెందిన దిల్షాద్ (20) ఇంటర్ వరకు చదివి ఇంటి వద్దే ఉంటోంది. బుధవారం ఉదయం స్నేహితుల ఇంటి గృహ ప్రవేశానికి వెళుతున్నట్లు చెప్పి పోయింది. తర్వాత ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించలేదు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఏడుగురిపై కేసు నమోదు

యాడికి: ఇరు వర్గాల ఘర్షణలో ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాలు.. నగరూరు గ్రామంలో గురువారం సాయంత్రం లక్కు రామాంజనేయులుకు చెందిన ఇంటి గోడ రాళ్లు లక్కు వీరన్న తీసుకుపోతుండటంతో రామాంజనేయులు అడ్డు చెప్పాడు. ఈక్రమంలో మాటామాటా పెరిగి ఘర్షణ పడ్డారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు వీరన్న, లక్ష్మీదేవి, గంగరత్నమ్మ, నీలకంఠ, లక్ష్మీదేవి, జయమ్మ, రామాంజనేయులు కేసు నమోదు చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

యాడికి: రాయలచెరువు గ్రామ సమీపంలో అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను గురువారం సాయంత్రం పట్టుకున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపారు. తాడిపత్రి మండలం బ్రాహ్మణపల్లె గ్రామానికి చెందిన శ్యాంసుదర్‌ను అరెస్టు చేసి ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.

పామిడి: గజరాంపల్లికి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం సీఐ ఎం రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. ఇసుక తరలిస్తున్న పెద్దవడుగూరు మండలం చిట్టూరు వాసులైన రామచంద్ర, ఆయన బావ రామాంజనేయులు, తమ్ముడు శ్రీకాంత్, ట్రాక్టర్ డ్రైవర్ ఉదయ్ కిరణ్‌పై కేసు నమోదు చేశారు.

శాస్త్రోక్తంగా అనంత పద్మనాభస్వామి వ్రతం

అనంతపురం కల్చరల్: స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని వలీస్వామి ఆశ్రమంలో అనంత పద్మనాభ స్వామి వ్రతం శాస్త్రోక్తంగా నిర్వహించారు. నూతనంగా ప్రతిష్ఠించిన కొల్హాపురి మహాలక్ష్మికి ప్రత్యేక గాజులతో అలంకరించి, భక్తులకు వితరణ చేశారు. ఆశ్రమ కమిటీ సభ్యులు విజయ్‌కుమార్ నేతృత్వంలో అభిషేకాలు, అలంకార సేవలు మధ్యాహ్నం తీర్థప్రసాద వినియోగం, అన్న వితరణ జరిగాయి.

దుండగులను శిక్షించాలి

గుంతకల్లుటౌన్: చిత్తూరు జిల్లా తాడవేణుగోపాలాపురం గ్రామానికి చెందిన వడ్డెర భవ్యశ్రీని అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఏపీ సంచార జాతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసులు, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఇందిరాదేవి డిమాండ్ చేశారు. గురువారం సంఘం కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. భవ్యశ్రీ హత్య ఘటనపై మహిళా కమిషన్, పోలీసులు స్పందించి తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. సంచారజాతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుళ్లాయప్ప పాల్గొన్నారు.

పంపిణీకి పప్పుశనగ సిద్ధం

పెద్దవడుగూరు : మండలంలో పప్పుశనగ సాగు చేసే రైతులకు విత్తనం సిద్ధంగా ఉంచినట్లు ఏఓ మల్లీశ్వరి గురువారం తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు ఆర్బీకేల్లో పాసుపుస్తకం, ఆధార్ కార్డుతో సంప్రదించాలని సూచించారు.

నగరానికి రెండు రోజులు నీటి సరఫరా బంద్

రాప్తాడురూరల్: అనంతపురం నగరానికి ఈనెల 30, అక్టోబరు 1న నీటి సరఫరా ఉండదని నగరపాలక సంస్థ ఎస్ఈ నాగమోహన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరానికి నీరు సరఫరా చేసే కూడేరు మండలం ముద్దలాపురం వద్ద కొత్తగా నిర్మించిన 16 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ఫిల్టరేషన్ ప్లాంట్‌కు ఇంటర్ కనెక్షన్ల పనులు జరుగుతాయన్నారు. నగరవాసులు సహకరించాలని ఆయన కోరారు.